20092024-DIS-04_Layout 1 9/20/2024 1:46 AM Page 1

'వేదిక' పేజీ కోసం సమకాలీన అంశాలపై వ్యాసాలను
ఈ చిరునామాకు పంపించండి. మీ వ్యాసం 700 పదాలకు మించకుండా ఉండాలి.
చిరునామా: 8-2-603, 1/7,8,9 కృష్ణాపురం, రోడ్ నం.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034.
e-mail: editpage@ntnews.com

నమస్తే తెలంగాణ

దాచేస్తే దాగని సత్యం

అలవికాని హామీలతో అధికారం చేజిక్కించుకున్న కొత్తలో కాంగ్రెస్ పాలకులు ఇదివరకటి బీఆర్ఎస్ పాలన మీద బురద జల్లాలని చూశారు. రాష్ట్రం అప్పులతో దివాళా తీసిందని, ఖాళీ ఖజానాను చేతికిచ్చి వెళ్లిపోయారని బీద అరుపులు అరిచారు. కానీ, ప్రగతి, సంక్షేమాలకు సమ ప్రాధాన్యం ఇచ్చిన ప్రథమ ముఖ్యమంత్రి కేసీఆర్ రాష్ట్రాన్ని కొత్తపుంతలు తొక్కిస్తూ నడిపిన అద్వితీయ పాలన చరిత్రలో నమోదైంది. రికార్డులు, అవార్డులు ఇందుకు సాక్ష్యంగా నిలుస్తున్నాయి. ఇదంతా మూసిపెడితే మాయమయ్యేదా? ఎవరి నుంచైతే దొంగిలించామో వారిని ఎన్నటికీ క్షమించలేమని అంటారు పెద్దలు. సీఎం రేవంత్ ఇదే తీరులో మాట్లాడేవారు. పదేండ్లలో తెలంగాణ అభివృద్ధి సాధించిందని ఒప్పుకుంటే ఎక్కడ కేసీఆర్ ప్రతిభా పాటవాలను ప్రశంసించినట్టు అవుతుందోనని ఆయన వెనుకాడేవారు. కానీ, కేంద్రం నుంచి వెలువడుతున్న నివేదికలు రాష్ట్ర ప్రగతిని వేనోళ్ల పొగుడుతుంటే రేవంత్ మాత్రం ఏం చేయగలరు? మాటమార్చి రాష్ట్ర ఆర్థికస్థితి సవ్యంగానే కాదు, దివ్యంగా కూడా ఉన్నట్టు నసుగుతూ అయినా చెప్పక తప్పలేదు. కాదు కాదన్నవారే ఔననేలా చేస్తుంది సత్యం. అదీ సత్యానికున్న శక్తి. దాచిన కొద్దీ ఎగదన్నుకు రావడం దాని నైజం.

ప్రధానమంత్రి ఆర్థిక సలహా మండలి (ఈఏసీ-పీఎం) విడుదల చేసిన తాజా నివేదిక కాంగ్రెస్ కల్లబొల్లి మాటల గాలి తీసేసింది. వయసులో అతిచిన్న రాష్ట్రం అభివృద్ధిలో అంగలు వేసినట్టు ఆ నివేదిక చాటిచెప్పింది. ఒకరకంగా చెప్పాలంటే సుమారు తొమ్మిదిన్న రేండ్ల బీఆర్ఎస్ పాలనకు ఆ నివేదిక మెరిట్ సర్టిఫికెట్ లాంటిది. కేసీఆర్ హయాంలో తలసరి ఆదాయంలో, జీఎస్డీపీలో రాష్ట్రం దూసుకుపోయింది. టాప్-10 రాష్ట్రాల్లో తెలంగాణ అగ్రగామిగా నిలిచింది. ఈ క్రమంలో తలసరిలో జాతీయ సగటు కన్నా ఏకంగా 94 శాతం అధిక్యం సాధించడం విశేషం. ఇక రాష్ట్రం ఏర్పడిన నాటికి రూ.5.05 లక్షల కోట్లుగా ఉన్న జీఎస్డీపీ.. 2023-24 నాటికి మూడింతలు పెరిగి రూ.14.64 లక్షల కోట్లకు చేరింది. ఇది బీఆర్ఎస్ పాలనలో జరిగిందని ప్రత్యేకించి చెప్పాల్సిన పని లేదు.

ఇవి బీజేపీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం అంగీకరించి, ఆవిష్కరించిన గణాంకాలు. ఇక తాజాగా రాష్ట్ర ప్రభుత్వం మధ్య, చిన్నతరహా పరిశ్రమల విధాన పత్రంలో కేసీఆర్ హయాంలో సాధించిన ప్రగతిని ప్రశంసించడం గమనార్హం. పదేండ్లలో ఎంఎస్ఎంఈలు 15 శాతం వృద్ధి సాధించాయని స్వయంగా కాంగ్రెస్ సర్కార్ చెప్పిందంటే.. బీఆర్ఎస్ పాలనలో జరిగిన ముందంజను ముచ్చటగా ఒప్పేసుకోవడమే కదా! కరోనా కల్లోలం ఫలితంగా మూతబడిన ఎంఎస్ఎంఈల సంఖ్య రాష్ట్రంలో అతి తక్కువగా ఉండటం గురించి కూడా విధాన పత్రంలో ప్రస్తావించారు. దీనికి కేవలం కేసీఆర్ పరిపాలనా పటిమ, దార్శనికత కారణమని ఎవరైనా చెప్పక తప్పదు. కాంగ్రెస్ పాలకులకు కొంచెం ఎక్కువ సమయం పట్టింది. అంతే తేడా.

బీసీల కోసం బీఆర్ఎస్ పోరుబాట

తెలంగాణ బీసీ స్వీయ రాజకీయ అస్తిత్వం రాజకీయ ప్రక్రియ రూపం సంతరించుకున్నది. అది మహత్తర ఉద్యమమై తెలంగాణ నేలపై విజృంభించబోతున్నది. మునుపెన్నడూ లేనివిధంగా బీసీలలో పెల్లుబుకుతున్న నిరసనలు కార్యరూపంగా మారి బలమైన ఉద్యమంగా ముందుకు సాగేందుకు రంగం సిద్ధమైంది. ఈ ఉద్యమాన్ని బీఆర్ఎస్ తన భుజాల మీద వేసుకొని సాగేందుకు నిర్మాణాత్మక రూపాన్ని రచిస్తున్నది.

జూలూరు గౌరీ శంకర్

రేపటి తెలంగాణలో జరుగబోయే భారీ రాజకీయ మార్పులకు బీఆర్ఎస్ శ్రీకారం చుట్టబోతున్నది. తెలంగాణ స్వీయ రాజకీయ అస్తిత్వం పరిపూర్ణం కావాలంటే బీసీ స్వీయ రాజకీయ అస్తిత్వాన్ని నిలపాలి. ఆ పనిని బీఆర్ఎస్ మాత్రమే చేయగలదు. స్థానిక సంస్థల్లో సమ వాటాగా 42 శాతం రిజర్వేషన్లు బీసీలకు ఇస్తామని చెప్పి గద్దెనెక్కిన కాంగ్రెస్ ఈ పని చేయకుండా స్థానిక సంస్థల ఎన్నికలకు పోకూడదు. దానికి ముందే కులగణన చేయాలి. నామమాత్రంగా చేస్తే బీసీలు ఒప్పుకోరు. ఓటరు లిస్టు ఆధారంగా కులగణన చేసి 42 శాతం రిజర్వేషన్లు ఇవ్వటం సాధ్యం కాదు. సమగ్ర కులగణనను జరపటానికి డెడికేటెడ్ కమిషన్‌ను నియమించామని చెప్తున్న రాష్ట్ర ప్రభుత్వం ఆ పని యుద్ధ ప్రాతిపదికన జరపాలని బీసీ సామాజిక వర్గాలు చేస్తున్న డిమాండ్‌కు బీఆర్ఎస్ కొండంత అండగా నిలుస్తూ శపథం తీసుకున్నది. ఇది ఆహ్వానించదగిన పరిణామం.

2024, సెప్టెంబర్ 18న తెలంగాణ భవన్‌లో జరిగిన బీసీ సమావేశంలో 'తెలంగాణ రాజకీయాలను మార్చే కీలక సమావేశంగా చరిత్రలో ఇది నిలిచిపోతుంది' అని కేటీఆర్ అన్నారు. పార్లమెంట్ ఎన్నికలకు ముందు ఓ చానల్‌కు ఇచ్చిన నాలుగున్నర గంటల సుదీర్ఘ ఇంటర్వ్యూలో తెలంగాణ స్వీయ రాజకీయ అస్తిత్వం అన్నది తమిళనాట స్థానికతతో నిలిచిన డీఎంకే అస్తిత్వం లాంటిదేనని కేసీఆర్ చెప్పారు. సరిగ్గా ఆ అంశాన్ని బీఆర్ఎస్ రాజకీయ పునాదిగా చేసుకుని ముందుకు సాగే కార్యాచరణ ప్రణాళికను తయారు చేస్తున్నట్టు కేటీఆర్ కూడా బహిర్గతం చేశారు. కామారెడ్డి బీసీ డిక్లరేషన్ అమలు జరిపేందుకు నవంబర్ 10 వరకు కేటీఆర్ గడువునిచ్చారు. ఆ తర్వాత స్థానిక సంస్థల్లో రిజర్వేషన్ల కోసం సమరం కొనసాగుతుందన్న మాట. ఈ సమావేశం ఓట్ల కోసమో, సీట్ల కోసమో, రాజకీయ పార్టీగా తమ అస్తిత్వం కోసమో జరిగింది కాదు, బీసీల ఆకాంక్షలను నెరవేర్చేందుకే అన్నది తేటతెల్లమవుతున్నది. తరతరాలుగా బీసీలు ఎదుర్కొంటున్న సమస్యల నుంచి విముక్తి కోసం ఏం చేయాలనే దానికి సుదీర్ఘ సమాలోచనలు జరపాలని బీఆర్ఎస్ నిర్ణయం తీసుకున్నది. ఈ సందర్భంగా బీసీల బాధలు, వారు ఎదుర్కొంటున్న సమస్యలను అట్టడుగు నుంచి క్షేత్రస్థాయిలో పరిశీలించి వారి జీవన స్థితిగతులను తెలుసుకోవాలి. అందుకు బీసీ నేతలే క్షేత్రస్థాయికి వెళ్లాలి. బీసీల విముక్తికి ఏమేం చేయాలో నివేదికలు తయారు చేయాలి.

ఒక దశలో 'ఇది ప్రభుత్వ వ్యతిరేక ఉద్యమం కాదు. బీసీల జీవన ప్రమాణాలు పెంచేందుకు సరైన పరిష్కార మార్గాలను తవ్వితీసే పరిశోధన కేంద్రంగా తెలంగాణ భవన్‌ను సిద్ధం చేసే ప్రక్రియ' అని కేటీఆర్ పేర్కొన్నారు. అంటే, బీసీలు ఓట్లేసే యంత్రాలు కాదని, తెలంగాణ సమాజాన్ని నడిపించే ఉత్పత్తి శక్తులని, వారి అభివృద్ధి జరగకుండా తెలంగాణ అభివృద్ధి జరగదని బీఆర్ఎస్ విశ్వసించే కార్యక్షేత్రంలోకి దూకుతున్నదనే విషయం స్పష్టమవుతున్నది.

> **కులగణనతో బీసీ వర్గాలకు సామాజిక న్యాయం జరగాలంటే తమిళనాడులో అంబాశంకర్ కమిషన్, జస్టిస్ తిరు ఎంఎస్ జనార్ధనమ్ చేసిన సర్వేలాగా లోతుగా అధ్యయనం చేయాలి. పంచాయతీ ఎన్నికలను జరిపించేందుకు హడావుడిగా బీసీ కులగణన చేయకుండా భవిష్యత్తులో కోర్టుల్లో నిలిచి, గెలిచేలా సమగ్ర కులగణన చేయవలసిన అవసరం ఉన్నది.**

స్థానిక సంస్థల్లో 42 శాతం రిజర్వేషన్లు ఇస్తామని కాంగ్రెస్ చెప్పింది. ఆ హామీ నెరవేర్చేదాకా బీఆర్ఎస్ పోరుబాట కొనసాగుతూనే ఉంటుంది. బీసీ రిజర్వేషన్ల చట్టబద్ధతకు సంబంధించిన ఇప్పటివరకు వెలువడిన న్యాయస్థానాల తీర్పులను తెలంగాణ సమాజం ముందు పెట్టేందుకు బీఆర్ఎస్ పరిశోధిస్తున్నది. విద్య, ఉద్యోగ, రాజకీయ రంగాల్లో బీసీ, ఎస్సీ, ఎస్టీల రిజర్వేషన్లు 50 శాతం దాటకూడదని అనేక తీర్పుల్లో ఉన్నది.

ఈ నేపథ్యంలో బీఆర్ఎస్ పరిశోధన ఉపయోగపడనున్నది. 1959లో మూడంచెల పంచాయతీరాజ్ వ్యవస్థ అమల్లోకి వచ్చినప్పటి నుంచి బీసీలు వెనుకబడిపోయారు. బీఆర్ఎస్ ఈ లెక్కలన్నీ బయటకుతీసే పనికి పూనుకున్నది. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీలు 90 శాతంగా ఉన్న రాష్ట్రంలో వారి జనాభా దామాషా పద్ధతిలో రిజర్వేషన్లు, సీట్లు దక్కాలి. దాన్ని చట్టబద్ధంగా అమలు చేయడం సాధ్యం కాదు. కోర్టు తీర్పులు అందుకు అడ్డువస్తాయి. దీనికోసం రాజ్యాంగ సవరణ చేయక తప్పదు. రాష్ట్రంలో 12,966 గ్రామ పంచాయతీలుంటే అందులో 1,14,620 వార్డులున్నాయి. రాష్ట్ర ఎన్నికల కమిషన్ చెప్పిన వివరాల ప్రకారం నల్లగొండ జిల్లాలో అత్యధికంగా 868 పంచాయతీలుండగా, మేడ్చల్ జిల్లాలో తక్కువ సంఖ్యలో పం చాయతీలున్నాయి. అదే విధంగా చూస్తే నల్గొండ జిల్లాలో 7,842 వార్డులుండగా, మేడ్చల్‌లో అతి తక్కువ వార్డులున్నాయి. స్థానికసంస్థల ఎన్నికల్లో రిజర్వేషన్లు ఖరారు చేసే విషయం రాష్ట్ర ప్రభుత్వ పరిధిలో ఉన్నదని చెప్తున్నప్పటికీ సుప్రీంకోర్టు మార్గదర్శకాల ప్రకారం బీసీ, ఎస్సీ, ఎస్టీలకు కలిపి 50 శాతం రిజర్వేషన్లు దాటకుండా చూడాలి. ఒకవేళ క్షేత్రస్థాయిలో బీసీ, ఎస్సీ, ఎస్టీలకు జనాభాను బట్టి రిజర్వేషన్లు ఇవ్వాలంటే ట్రిపుల్ టెస్ట్ ద్వారా సర్వే చేసి ఖరారు చేయాలి. అది పంచాయతీ యూనిట్‌గా జరగాలి. చివరగా సుప్రీం మార్గదర్శకాలు అతిక్రమించకుండా చూసుకోవాలి. ఈ నేపథ్యంలోనే బీఆర్ఎస్ బీసీలను కలుపుకుపోయే గురుతర బాధ్యతను భుజాలపై వేసుకొని ముందుకు సాగుతున్నది. ఇందుకు క్షేత్రస్థాయిలో బీసీలను సన్నద్ధం చేస్తున్నది.

ఈ విషయమై బీసీ వర్గాల ప్రజలకు సంపూర్ణ అవగాహన కల్పించాలి. 42 శాతం ఇస్తామని ఏ విధంగా బీసీ డిక్లరేషన్ ఇచ్చి కాంగ్రెస్ ఓట్లడిగిందో, ఆ విధంగా అమలు చేసి చూపాలి. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీ అమలు కోసం ముందుండి పోరు సలుపుతున్న ప్రతిపక్ష బీఆర్ఎస్ పార్టీ వెంటే ప్రతి బీసీ బిడ్డ నడవాల్సిన సమయం ఇది.

(వ్యాసకర్త: తెలంగాణ తొలి జీసీ కమిషన్ సభ్యులు)

దామగుండం పోతే యమగండమే

స్వర్ణ కిలారి

దామగుండం రామలింగేశ్వర స్వామి దర్శనమైన తర్వాత ముందు రచించుకున్న ప్రణాళిక ప్రకారం మా స్నేహితుల బృందం అక్కడున్న ఆశ్రమంలో స్వామీజీని కలవాలనుకున్నాం. కొన్ని వేల కిలోమీటర్ల దూరంలో ఉన్న కేరళ నుంచి 1980లో హైదరాబాద్‌కు 70 కిలోమీటర్ల దూరంలో ఉన్న పూడూరు గ్రామానికి వలస వచ్చారట స్వామీజీ. గ్రామస్థుల ద్వారా ఆయన ఫోన్ నెంబర్ తెలుసుకొని మాట్లాడి, చెప్పిన సమయానికి ఆయన ఉండే ఆశ్రమానికి బయల్దేరాం. ఆశ్రమం అంటే వందల, వేల ఎకరాల్లో ఆడంబరంగా ఉండి చుట్టూ మందీమార్బలంతో ఉండేది కాదు. రెండు ఎకరాల్లో ఉన్న చిన్న రెండు గదుల ఇల్లు మాత్రమే.

అనుకున్నట్టుగానే సుమారు 50 ఏండ్లు పైబడిన ఆయన అపారమైన జ్ఞానంతో వచ్చిన తేజస్సుతో కాబోలు, కాషాయ వస్త్రాల్లో వెలిగిపోతున్నారు. 'మీకేం కావాలి' అని ఆయనే మమ్మల్ని అడిగారు. 'దామగుండం అడవి గురించి, అక్కడ కేంద్ర ప్రభుత్వం తలపెట్టిన రాడార్ స్టేషన్ ప్రాజెక్టు గురించి, ఇక్కడున్న వృక్ష సంపద గురించి, నిర్వాసితుల గురించి, లాభనష్టాల గురించి చెప్పండి' అని అడిగాం. 'మీకు అడవి వద్దా?' అన్న ఆయన సూటి మాట నిజంగా గుండెలను తాకింది. అందరం ఒక్క క్షణం పాటు మౌనంగా ఉండిపోయాం. గలగల పారే సెలయేరులా ఆయన చెప్పుకుంటూ పోయారు.

మొత్తం 2,900 ఎకరాల అటవీ భూమిలో యాంటెన్నా పార్క్ 1400 ఎకరాలు, టెక్నికల్ ఏరియా 1090 ఎకరాలు, కార్యాలయం 310 ఎకరాలు, రేడియేషన్ సేఫ్ జోన్ 100 ఎకరాలుగా స్వామీజీ పేరొన్నారు. ఒక సంవత్సరంలో ఒక చెట్టు లక్ష లీటర్ల ఆక్సిజన్ ఇస్తుందని, ఈ రాడార్ స్టేషన్ కోసం 12 లక్షల చెట్లను కొట్టివేస్తే పర్యావరణానికి భారీ నష్టం వాటిల్లుతుందని ఆయన వివరించారు. మూసీకి వరప్రదాయిని అయిన దామగుండాన్ని కాపాడుకోకపోతే, 2800 మీటర్ల లోతు వరకు భూగర్భ జలాలు కూడా కలుషితమవుతాయని, దాని ప్రభావం హైదరాబాద్ మీదనే కాక యావత్ తెలంగాణ సమాజం మీద, వనరుల మీద, ప్రజల ఆరోగ్యం మీద తీవ్రమైన ప్రభావాన్ని చూపుతుందని ఆవేదన వ్యక్తం చేశారు.

> **ఈ దామగుండం అడవి కొన్ని లక్షల చెట్లకు నెలవు. జింకలు, తోడేళ్లు, మనుబోతులు, అడవి పందులు, అనేకరకాల పక్షులకు ఆలవాలమైన ఈ అడవి జీవవైవిధ్యంతో అలరారుతున్నది. అంతేకాకుండా ఈ అడవి ఎన్నోరకాల అరుదైన, ఔషధ మొక్కలకు కూడా ప్రసిద్ధి. వికారాబాద్ జిల్లా పూడూరు మండలంలోని దామగుండం రిజర్వ్ ఫారెస్ట్‌లో నిర్మిస్తున్న ఈ రాడార్ స్టేషన్‌ను పలు పర్యావరణ సంస్థలు, గ్రామ ప్రజలు, ఉద్యమకారులు కూడా వ్యతిరేకిస్తున్నారని చెప్పారు. 'సేవ్ దామగుండం' అనే నినాదాన్ని తీసుకొని ఈ అటవీ భూముల రక్షణకు స్థానిక ప్రజానీకం ప్రయత్నాలు ప్రారంభించారని తెలిపారు.**

భారత నౌకాదళ సంస్థ దామగుండం అటవీ ప్రాంతంలో రూ.2500 కోట్లతో తక్కువ ఫ్రీక్వెన్సీ రాడార్ వ్యవస్థను నెలకొల్పాలని యోచిస్తున్నది. ఈ ప్రాజెక్టు ప్రతిపాదన పన్నెండేండ్లుగా ఉన్నా, తెలంగాణ ఏర్పడినాక ఒక దశాబ్దం పాటు కేసీఆర్ ప్రభుత్వం ఆ ప్రాజెక్టుకు సహకరించలేదు. కానీ, కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక ఒక్కసారిగా ప్రాజెక్టు పనులు ఊపందుకున్నాయి. దామగుండం అటవీ భూములను, భారత నౌకాదళ సంస్థకు కట్టబెట్టాలన్న ఆలోచనను విరమించుకోవాలని ఇటీవలే నేషనల్ అలయెన్స్ ఆఫ్ పీపుల్స్ మూవ్‌మెంట్ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కోరిందట. 'మరి ఈ ప్రాజెక్టుకు వ్యతిరేకంగా ప్రజలంతా సంఘటితమవుతున్నారా' అని అడిగిన ప్రశ్నకు 'కొందరు ప్రజలు అమాయకులు. వారు రాజకీయ నాయకుల తాత్కాలిక వాగ్దానాలను నమ్ముతున్నారు. బయటకు పోవాల్సిన అవసరం లేకుండా కొన్ని ఎకరాల్లో వాళ్లకు మార్కెట్ కట్టిస్తామని, బడి కట్టిస్తామని, ఉద్యోగ కల్పన చేస్తామని, 27 కిలోమీటర్ల మేర రోడ్డు ఏర్పాటు చేస్తామని మాట ఇచ్చారట. ఇది ఎంతవరకు సాధ్యమవుతుందో' అని నిర్వేదంగా సమాధానం ఇచ్చారు. త్వరలో తనకున్న రెండు ఎకరాలను అమ్ముకొని శాశ్వతంగా ఈ ప్రదేశాన్ని వదిలి వెళ్లిపోతున్నాను అంటున్నప్పుడు ఆయన కళ్లల్లో చిన్నతడి. అయినా అది కనపడనివ్వకుండా, 'మీరంతా ఒక సాయం చేయాలి, మనందరం కలిసి ఒక మానవహారం వంటి నిరసన కార్యక్రమం చేస్తేనే ప్రభుత్వాలకు, న్యాయవ్యవస్థకు, నౌకాదళానికి మన వేదన అర్థమై ఈ ప్రాజెక్టు వెనుకకు వెళ్తుందేమో' అనే చిరు ఆశను వ్యక్తం చేశారు.

ఈ మట్టికి, ఈ నేలకు, ఈ ప్రజలకు ఎటువంటి సంబంధం లేని ఎక్కడో పుట్టి పెరిగిన ఒక కేరళ మనిషిలో ఉన్న భవిష్యత్తు తరాలకు ఏదో చేయాలనే తపనను చూస్తే మాలో ఏదో తెలియని అపరాధభావంతో కూడిన భావోద్వేగపు చెమ్మ కలిగింది. చివరగా 'దామగుండం పోతే యమగండం' తప్పదు అన్న ఆయన మాటలు విన్నాక చివుక్కుమన్న మనసుతో ఆ మహా మనీషికి ప్రణామాలు అర్పించి భారమైన మనసుతో వీడ్కోలు చెప్పాం. దామగుండం అడవుల్లో లక్షలాది అరుదైన వృక్షాలను, ఔషధ మొక్కలను, జంతుజాలాన్ని పణంగా పెట్టే ఈ నేవీ రాడార్ ప్రాజెక్టుకు వ్యతిరేకంగా ఉద్యమిస్తున్న ప్రజల పోరాటం సఫలం కావాలని ఆకాంక్షిస్తున్నాను.

ప్రాంతీయ అస్తిత్వానికి ప్రమాదం

బుద్ధా మురళి

'ఒకే దేశం-ఒకే ఎన్నిక' వినడానికి నినాదం బాగుంటుంది. చెప్పుకోవడానికి కూడా కొన్ని మంచి మార్పులు కనిపిస్తాయి. సువిశాల భారతదేశంలో ఎప్పుడూ ఎక్కడో ఒకచోట ఎన్నికలు జరుగుతూనే ఉంటాయి. ఎన్నికలు జరిగినప్పుడు కోడ్ అమల్లో ఉంటుంది కాబట్టి అక్కడ పనులు నిలిచిపోతాయి. అలా కాకుండా పంచాయతీలకు మొదలుకొని అసెంబ్లీకి, పార్లమెంట్‌కు ఒకేసారి ఎన్నికలు జరిగితే ఓ రెండు నెలల్లో కోడ్ ముచ్చట ముగిసి దేశం అభివృద్ధి పథంలో దూసుకువెళ్లడానికి దేశమంతా ఒకేసారి జరిగే ఎన్నికలు ఉపయోగపడతాయి. ఇదొక కోణం.

ఎప్పుడూ దేశంలో ఎక్కడో ఒకచోట ఎన్నికలు జరగడం, ప్రచారం, రాజకీయ విమర్శలు, ఆరోపణలతో అభివృద్ధి నిలిచిపోతుందనే వాదన నిజమే. కానీ, ఒకేసారి ఎన్నికల వల్ల రాష్ట్రాలు తమ ప్రాధాన్యాన్ని కోల్పోతాయి. ఇది సమాఖ్య దేశం. భిన్న మతాలు, భిన్న భాషలు, భిన్న సంస్కృతులతో భిన్నత్వంలోనే ఏకత్వంతో సాగుతున్న దేశం. గతంలో జరిగిన ఎన్నికల పరిణామాలను బట్టి చూస్తే ఒకేసారి రాష్ట్ర శాసనసభకు, పార్లమెంట్‌కు ఎన్నికలు నిర్వహించడం వల్ల రాష్ట్రాలు తమ అస్తిత్వాన్ని కోల్పోతాయి. కులాలు, ప్రాంతాలు, భాష పేరుతో కాకుండా హిందూత్వ పేరుతో దేశం ఏకంగా ఉండాలని బీజేపీ కోరుకుంటున్నది. హిందూత్వ ఓటు బ్యాంకు ద్వారా శాశ్వతంగా అధికారంలో ఉండాలనేది బీజేపీ లక్ష్యం. ఒకే దేశం-ఒకే ఎన్నిక, ఒకే భాష నినాదాలు బీజేపీకి రాజకీయంగా ప్రయోజనం కలిగించేవి. అదే సమయంలో రాష్ట్రాలు ప్రత్యేకత కోల్పోయే ప్రమాదం ఉన్నది. బీజేపీ, మిత్రపక్షాల మద్దతుతో మెజారిటీ సాధించినందున తాను కోరుకున్నది బీజేపీ అమలుచేస్తున్నది. చంద్రబాబు ఉమ్మడి రాష్ట్రం ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు కేంద్రంలో ఫ్రంట్ రాజకీయాలు జోరుగా సాగేవి. బాబు ముఖ్యమంత్రిగా కేంద్రంలో చక్రం తిప్పేవారు. రాష్ట్రాలు బలంగా ఉండి, కేంద్రం బలహీనంగా ఉండాలని వాదించేవారు. ఇప్పుడు బీజేపీ కూటమిలో ఉన్న బాబు రాష్ట్రాలను బలహీనపరిచి కేంద్రాన్ని మరింత బలంగా తయారు చేసే ఒకే దేశం ఒకే ఎన్నికలను సమర్థిస్తున్నారు. వేదాంత కంపెనీ మహారాష్ట్రలో రూ.లక్ష కోట్ల పెట్టుబడి గల సెమీ కండక్టర్ పరిశ్రమకు శంకుస్థాపన చేసిన తర్వాత కూడా మోదీ ప్రభుత్వం దాన్ని గుజరాత్‌కు తరలించింది. మహారాష్ట్రలో బీజేపీ కూటమే అధికారంలో ఉన్నది. అయినా

ఏమీ చేయలేని నిస్సహాయ స్థితి. ఆయా రాష్ట్రాల్లో తమ పార్టీ గెలవాలనే ఉద్దేశంతో కనీసం ఎన్నికల సమయంలోనైనా రాష్ట్రాలకు కొన్ని వరాలు ప్రకటించేవారు.

ఒకేసారి ఎన్నిక వల్ల ఇక అలాంటి వరాలపై ఆశలు పెట్టుకోవలసిన అవసరం లేదు. పార్లమెంట్ ఎన్నికలకు, అసెంబ్లీ ఎన్నికలకు ప్రజలు భిన్నంగా స్పందిస్తారు. పార్లమెంట్ ఎన్నికలను దేశం కోణంలో చూస్తే అసెంబ్లీ ఎన్నికలను తమ రాష్ట్ర ప్రయోజనాల కోణంలో చూస్తారు. ఏడాదిన్నర కిందట ఎన్నికలు జరిగిన కర్ణాటక లో అసెంబ్లీ ఎన్నికల్లో అధికారంలో ఉన్న బీజేపీ ఘోరంగా ఓడిపోయింది. రాష్ట్రం లో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది. ఆరు నెలల తర్వాత జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ దెబ్బతిని బీజేపీ విజయం సాధించింది. తమిళనాడు వంటి రాష్ట్రాల్లో పార్లమెంట్ ఎన్నికలైనా, అసెంబ్లీ ఎన్నికలైనా తమ రాష్ట్రం తమకు ముఖ్యమని భావిస్తారు. పార్లమెంట్, అసెంబ్లీ ఏ ఎన్నికలైనా తమిళనాడులో తమిళ పార్టీల హవానే కానీ, జాతీయ పార్టీల హవా కనిపించదు. మిగిలిన రాష్ట్రాల్లో అసెంబ్లీ ఎన్నికలకు ఒక తీరుగా, పార్లమెంట్ ఎన్నికలకు మరోవిధంగా ఓటర్లు స్పందించారు. పార్లమెంట్ ఎన్నికల్లో, అసెంబ్లీ ఎన్నికల్లో ఓటర్లు భిన్నంగా స్పం దిస్తారు, రెండూ ఒకేసారి వచ్చినప్పుడు తమకు నష్టం కలిగిందనే ఉద్దేశంతో 2004లో ఉమ్మడి రాష్ట్రంలో బాబు అసెం బ్లీ రద్దుచేసి ముందస్తుకు వెళ్లాలని చూశారు.

> **అసెంబ్లీ రద్దు నిర్ణయాన్ని సచివాలయంలో ఒకవైపు బాబు మీడియాకు వివరిస్తుండగానే ఢిల్లీలో ఎన్నికల కమిషన్ 'ఉమ్మడి రాష్ట్ర ఎన్నికలు ఇప్పుడు నిర్వహించం. పార్లమెంట్ ఎన్నికలతో పాటే నిర్వహిస్తాం' అని ప్రకటించింది. ఆ ఎన్నికల్లో కేంద్రంలో రాష్ట్రంలో కాంగ్రెస్ గెలిచింది. బాబు పార్టీ ఓడిపోయింది. ఇప్పుడు కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ కూటమిలో ఉండటం వల్ల ఒకేసారి ఎన్నికలు జరగడం తమకు మేలే అని టీడీపీ భావిస్తూ ఉండవచ్చు.**

ఇదేవిధంగా అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికలు వేర్వేరుగా జరిగితే తమకు ప్రయోజనం అని గతంలో టీఆర్ఎస్ ముందస్తు ఎన్నికలకు వెళ్లింది. 2018లో ఈ నిర్ణయం టీఆర్ఎస్‌కు కలిసివచ్చింది కూడా.

బీజేపీ, దాని మిత్రపక్షాలు జమిలి ఎన్నికలను స్వాగతిస్తుండగా బీజేపీ వ్యతిరేకపక్షాలు వ్యతిరేకిస్తున్నాయి. గతంలో బీహార్ రాష్ట్ర ఎన్నికల్లో ఆ రాష్ట్రానికి లక్ష కోట్ల ప్రత్యేక ప్యాకేజీని మోదీ ప్రకటించారు. హామీని అమలుచేసినా, చేయకపోయినా పార్లమెంట్‌కు, అసెంబ్లీకి విడివిడిగా ఎన్నికలు జరిగినప్పుడు రాష్ట్రాలకు ప్రాధాన్యం ఇవ్వాల్సి ఉంటుంది. ప్యాకేజీలు, వరాలు ప్రకటించాల్సి ఉంటుంది. ఆయా రాష్ట్రాల్లో ఎన్నికలు జరిగినప్పుడు ఆ రాష్ట్రానికి తాము ఏం చేశాం, మళ్లీ గెలిస్తే ఏం చేస్తామని ప్రకటించాల్సి ఉంటుంది. ఓటర్లలో చర్చ రాష్ట్రం కేంద్రంగా సాగుతుంది. దీనివల్ల ఆ రాష్ట్రానికి ఎంతో కొంత మేలు జరుగుతుంది. జమిలి ఎన్నికల వల్ల దేశవ్యాప్త అంశమే తెరపైకి వస్తుంది కానీ, రాష్ట్రాల అంశాలకు, రాష్ట్రాల ప్రాధాన్యాలకు చోటుండదు. ఒకరకంగా రాష్ట్రాలు తమ ప్రత్యేకతను, ప్రాధాన్యాన్ని కోల్పోతాయి.



'వన్ ఎలక్షన్' సాధ్యం కాదు!

'వన్ నేషన్-వన్ ఎలక్షన్' అనేది ఆచరణ సాధ్యం కాని ప్రతిపాదన. మన దేశంలో ఉండే విభిన్న ఎన్నికల వ్యవస్థలోని సంక్లిష్టతలను ఇది విస్మరించింది. అంతేకాదు, సమాఖ్య వాదాన్ని కూడా విస్మరించింది. ప్రాంతీయ సమస్యలు, పాలనా ప్రాధాన్యాల్లో సమస్యల దృష్ట్యా లాజిస్టిక్ పరంగా ఇది సాధ్యం కాదు.

- ఎంకే స్టాలిన్, తమిళ నాడు ముఖ్యమంత్రి